# సెన్సెక్స్ రాకెట్ పరుగు

- *దేశీయ స్టాక్ మార్కెట్లలో కొనుగోళ్ల జాతర* • *ఆల్‌టైమ్ సింగిల్ డే హై రికార్డులు నమోదు*
- *ఏకంగా 2,975 పాయింట్లు ఎగబాకిన సెన్సెక్స్* • *917 పాయింట్లు ఎగిసిన నిఫ్టీ*
- *ఒక్కరోజే రూ.16.15 లక్షల కోట్లు పెరిగిన మదుపరుల సంపద* • *మెరిసిన ఐటీ, మెటల్, రియల్టీ షేర్లు*
- *కలిసొచ్చిన భారత్-పాక్ కాల్పుల విరమణ, అమెరికా-చైనా ట్రేడ్ డీల్, అంతర్జాతీయ మార్కెట్ల లాభాలు*

*దేశీయ స్టాక్ మార్కెట్లలో కొనుగోళ్ల ఉత్సాహం ఉరకలెత్తింది.*

కాల్పుల విరమణతో భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు తగ్గడం.. మదుపరులు మెచ్చారు. అమెరికా-చైనా ట్రేడ్ డీల్, గ్లోబల్ మార్కెట్లలో లాభాలూ కలిసొచ్చాయి. దీంతో అన్ని రంగాల్లో పెట్టుబడులకు ఇన్వెస్టర్లు ముందుకొచ్చారు.

*ఫలితంగా సెన్సెక్స్, నిఫ్టీలు మునుపెన్నడూ లేనివిధంగా ఈ ఒక్కరోజే గరిష్ఠ లాభాలను అందుకున్నాయి. దాదాపు 4 శాతం పుంజుకున్నాయి. ఆయా సంస్థల మార్కెట్ విలువ కూడా ఆల్‌టైమ్ హై రికార్డు స్థాయిలో రూ.16.15 లక్షల కోట్లు పెరిగింది.*



ముంబై, మే 12: మదుపరులలో పెట్టుబడుల ఉత్సాహం తొణికిసలాడింది. భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు శాంతించడంతో స్టాక్ మార్కెట్లు సోమవారం బయ్యింగ్ జోష్‌ను సంతరించుకున్నాయి. దీంతో ఈ ఒక్కరోజే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీలు మునుపెన్నడూ లేనివిధంగా లాభపడ్డాయి. సెన్సెక్స్ ఏకంగా 2,975. 43 పాయింట్లు లేదా 3.74 శాతం ఎగబాకి 82,429.90 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 916.70 పాయింట్లు లేదా 3.82 శాతం ఎగిసి 24,924.70 దగ్గర నిలిచింది. ఉదయం ఆరంభం నుంచే జోష్ మీదున్న సూచీలు.. సమయం గడుస్తున్నకొద్దీ ఇంకా పెరుగుతూపోయాయి. ఈ క్రమంలోనే ఒకానొక దశలోనైతే సెన్సెక్స్ 3,041.50, నిఫ్టీ 936.80 పాయింట్లు పుంజుకున్నాయి.

### తొలగిన భయాందోళనలు

పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'తో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరిన విషయం తెలిసిందే. దీంతో స్టాక్ మార్కెట్లు తీవ్ర నష్టాలకు లోనయ్యాయి. మదుపరులు పెట్టుబడుల ఉపసంహరణకు దిగడంతో మార్కెట్ సంపద లక్ష కోట్ల రూపాయల్లో ఆవిరైపోయింది. అయితే భారత్-పాక్‌లు కాల్పుల విరమణకు అంగీకరించడంతో ఇన్వెస్టర్లలో నెలకొన్న భయాందోళనలు వీడాయి. అమెరికా-చైనా ట్రేడ్ డీల్ కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను బలపర్చింది. అంతర్జాతీయ సానుకూలతలూ కలిసొచ్చాయి.


### రూ.432 లక్షల కోట్లకు..

స్టాక్ మార్కెట్లు భారీ లాభాల్లో పరుగులు పెట్టడంతో మదుపరుల సంపద కూడా అంతే స్థాయిలో ఎగిసింది. బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ సోమవారం రూ.16,15,275.19 కోట్లు పెరిగి రూ.4,32,56,125.65 కోట్ల (5.05 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. మునుపెన్నడూ మార్కెట్ సంపద ఒక్కరోజే ఈ స్థాయిలో పెరగలేదు. దీంతో ఇదో ఆల్‌టైమ్ సింగిల్ డే హైగా రికార్డులకెక్కింది. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 4.18 శాతం, మిడ్‌క్యాప్ సూచీ 3.85 శాతం చొప్పున పెరిగాయి. కాగా, ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, చైనా, హాంకాంగ్ సూచీలూ లాభపడ్డాయి. ఇది కూడా దేశీయ స్టాక్ మార్కెట్లకు కలిసొచ్చింది.

- గత ఏడాది జూన్ తర్వాత సెన్సెక్స్, నిఫ్టీలు ఒక్కరోజే ఈ స్థాయిలో పెరగడం ఇదే తొలిసారి.
- **2024 జూన్ 3న సెన్సెక్స్ 2,507.47 పాయింట్లు, జూన్ 5న నిఫ్టీ 735.85 పాయింట్లు పెరిగాయి. ఈ రికార్డులు కనుమరుగైపోయాయి.**
- నిరుడు జూన్ 3న బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.13 లక్షల కోట్లకుపైగా ఎగిసింది. ఈ రికార్డూ తాజాగా చెరిగిపోయింది.
- **బీఎస్ఈలో ఐటీ రంగ షేర్లు అత్యధికంగా 6.75 శాతం లాభపడ్డాయి. ఇన్ఫోసిస్ 7.91 శాతం పుంజుకున్నది.**

#### లాభాలకు కారణాలు

- భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ
- టారీఫ్‌ల తగ్గింపునకు అమెరికా-చైనా అంగీకారం
- అంతర్జాతీయ స్టాక్ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు
- పెట్టుబడులకు మదుపరులు పెద్దపీట వేయడం
- ఐటీ, మెటల్, రియల్టీ షేర్లు ఆకట్టుకోవడం




#### సెన్సెక్స్ టాప్-10 లాభాలు

| | |
|---|---|
| **2025 మే 12** | **2,975.43** |
| 2024 జూన్ 3 | 2,507.47 |
| 2020 ఏప్రిల్ 7 | 2,476.26 |
| 2021 ఫిబ్రవరి 1 | 2,314.84 |
| 2024 జూన్ 5 | 2,303.19 |
| 2009 మే 18 | 2,110.79 |
| 2024 నవంబర్ 22 | 1,961.32 |
| 2019 సెప్టెంబర్ 20 | 1,921.15 |
| 2020 మార్చి 25 | 1,861.75 |
| 2022 ఫిబ్రవరి 15 | 1,736.21 |

#### లాభాల్లో పాక్ సూచీ

*నిన్నమొన్నటిదాకా భీకర నష్టాల్లో కొట్టుమిట్టాడిన పాకిస్థాన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (పీఎస్ఎక్స్) సూచీ కూడా భారీ లాభాల్లోకి వచ్చింది. సోమవారం కేఎస్ఈ-100 సూచీ 10,123.10 పాయింట్లు లేదా 9.45 శాతం ఎగిసి 1,17,297.73 వద్ద ముగిసింది. ఆరంభంలోనే 9,929.48 పాయింట్లు కోలుకున్నది. భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' దెబ్బకు పాకిస్థాన్ అల్లాడిపోవడంతో అక్కడి స్టాక్ మార్కెట్లు కుదేలయిన సంగతి విదితమే.*



# శాంతించిన బంగారం

**రూ.3,400 తగ్గిన తులం ధర • రూ.96,550కి దిగొచ్చిన పుత్తడి**

న్యూఢిల్లీ, మే 12: రికార్డుస్థాయిలో దూసుకుపోయిన బంగారం ధరలు ఎట్టకేలకు శాంతించాయి. భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు తగ్గుముఖం పట్టడంతోపాటు అమెరికా-చైనా దేశాల మధ్య ప్రతీకార సుంకాల విధింపు వాయిదా పడటంతో మదుపరులు తమ పెట్టుబడులను సురక్షితమైన అతి విలువైన లోహాల నుంచి ఈక్విటీ మార్కెట్లకు తరలించడంతో భారీ స్థాయిలో ధరలు దిగొచ్చాయి. దేశ రాజధాని న్యూఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల పుత్తడి ధర రూ.3,400 తగ్గి రూ.96,500కి దిగొచ్చినట్టు ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. 99.5 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం కూడా ఇంతే స్థాయిలో తగ్గి రూ.96,100కి చేరుకున్నది. గడిచిన పది నెలల్లో ఒకేరోజు ఇంతటి స్థాయిలో తగ్గుముఖం పట్టడం ఇదే తొలిసారి. జూలై 23, 2024న బంగారం ధర రూ.3,350 తగ్గిన విషయం తెలిసిందే. శనివారం గోల్డ్ ధర రూ.99,950 స్థాయిలో ఉన్నది. ఇటు హైదరాబాద్‌లో 24 క్యారెట్ తులం ధర రూ.1,800 తగ్గి రూ.96,880కి దిగిరాగా, 22 క్యారెట్ ధర రూ.1,650 తగ్గి రూ.88,800గా నమోదైంది.

### వెండిది కూడా అదేదారి..

బంగారంతోపాటు వెండి ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు నిలిచిపోవడంతో కిలో వెండి రూ.200 తగ్గి రూ.99,700కి దిగొచ్చింది. అలాగే హైదరాబాద్‌లో కిలో వెండి రూ.2,000 తగ్గి రూ.1,09,00గా నమోదైంది. ప్రతీకార సుంకాల విధింపుపై అమెరికా-చైనా దేశాల మధ్య గత వారం రోజులుగా జరుగుతున్న చర్చలు ఎట్టకేలకు కొలిక్కివచ్చాయి. చైనా ఉత్పత్తులపై అమెరికా సుంకాన్ని 145 శాతం నుంచి 30 శాతానికి తగ్గించడానికి ఒప్పుకోవడంతోపాటు, చైనా కూడా యూఎస్ ఉత్పత్తులపై సుంకాన్ని 10 శాతానికి తగ్గించడానికి అంగీకరించింది. దీంతో గత నెల రోజులుగా ఇరు దేశాల మధ్య జరుగుతున్న వాణిజ్య యుద్ధానికి బ్రేక్‌పడటంతో గ్లోబల్ ఇన్వెస్టర్లు ఊపిరి పీల్చుకున్నారు. మరోవైపు, మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో బంగారం ధర రూ.3,932 లేదా 4.07 శాతం తగ్గి రూ.92,586గా నమోదైంది.

# ఆరు ఎయిర్ బ్యాగ్‌లతో మారుతి మాడళ్లు

న్యూఢిల్లీ, మే 12: భద్రత ప్రమాణాలకు పెద్దపీట వేయడంలో భాగంగా కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ ఆరు ఎయిర్‌బ్యాగ్‌లతో తీర్చిదిద్దినట్టు పేర్కొంది. వీటిలో వ్యాగన్‌ఆర్, ఆల్టో కే10, సెలేరియా, ఈకోతోపాటు ఇతర మాడళ్లు కూడా ఉన్నాయి. కొనుగోలుదారుల భద్రతపై మా కమిట్‌మెంట్‌కు ఉన్న నిదర్శనమే ఇదని కంపెనీ వర్గాలు పేర్కొన్నాయి.



# హైదరాబాద్‌లో గెలాక్సీ హెల్త్ ప్రాంతీయ కార్యాలయం

హైదరాబాద్, మే 12: గతేడాది ఆరోగ్య బీమా సేవలు ఆరంభించిన గెలాక్సీ హెల్త్ ఇన్సూరెన్స్..దక్షిణాదిలో వ్యాపార విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో తన ప్రాంతీయ కార్యాలయాన్ని తెరిచింది. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లలో ఉన్న వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యాలయాన్ని ప్రారంభించినట్టు కంపెనీ ఎండీ, సీఈవో జీ శ్రీనివాసన్ తెలిపారు. గడిచిన కొన్ని నెలల్లోనే రూ.17 కోట్ల ప్రీమియం వసూళ్లు చేసినట్టు, వచ్చే మార్చి నాటికి ఇది రూ.200 కోట్లకు చేరుకుంటుందని ఆశిస్తున్నట్టు వెల్లడించారు. అలాగే ఆరోగ్య బీమాకు సంబంధించి ప్రస్తుతం ఏడు పాలసీలను విక్రయిస్తున్న సంస్థ..వచ్చే మార్చిలోగా మరో 10 కొత్త పాలసీలను ఆవిష్కరించనున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రస్తుతం 6 వేల మంది ఏజెంట్లు ఉండగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి వీరిని 60 వేలకు పెంచుకోవాలనుకుంటున్నట్లు చెప్పారు.

# సింగరేణి సీఎండీకి ఎక్సలెన్స్ అవార్డు

హైదరాబాద్, మే 12 (నమస్తే తెలంగాణ) : సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ బలరామ్‌కు మరో పురస్కారం వరించింది. తాజాగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ వారు ప్రతిష్ఠాత్మక ఫెర్ఫార్మెన్స్ ఎక్సలెన్స్ (ఐఐఐఈ) పురస్కారాన్ని ప్రకటించారు. ఆదివారం మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌లో జరిగిన 25వ సీఈవో కాన్ఫరెన్స్‌లో బలరామ్ తరపున ఐఐఐఈ నేషనల్ కౌన్సిల్ సభ్యుడు, సింగరేణి అడ్మినిస్ట్రేట్ మేనేజర్ భాస్కర్ ఈ అవార్డును అందుకున్నారు.



# సొనాటా సాఫ్ట్‌వేర్ నూతన సెంటర్

హైదరాబాద్, మే 12(నమస్తే తెలంగాణ): ప్రముఖ సాఫ్ట్‌వేర్ సేవల సంస్థ సొనాట సాఫ్ట్‌వేర్..హైదరాబాద్‌లో మరో నూతన సెంటర్‌ను నెలకొల్పింది. 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో వంశీరాం టెక్‌పార్క్‌లో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాఫ్ట్‌వేర్, లైఫ్‌సైన్సెస్‌లకు హైదరాబాద్ జీసీసీ హబ్‌గా మారిందని, అభివృద్ధి, సంక్షేమం, పెట్టుబడులు, ఉద్యోగ కల్పన తదితర విభాగాలు సమతుల్యంగా సాగుతున్నాయన్నారు. కొత్తగా రాష్ట్రంలోకి రూ.3 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయన్నారు. కంపెనీ ఎండీ, సీఈవో సమీర్ ధీర్ మాట్లాడుతూ..ఈ నూతన సెంటర్‌తో వచ్చే మూడు నుంచి ఐదేండ్లకాలంలో 5 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు.

# అమెరికా-చైనా టారిఫ్‌లు కట్

జెనీవా, మే 12: పరస్పర ప్రతీకార సుంకాలపై అమెరికా, చైనా వెనక్కి తగ్గాయి. తమ మధ్య నెలకొన్న వాణిజ్య యుద్ధాన్ని 90 రోజులపాటు విరమిస్తున్నట్టు సోమవారం జెనీవాలో ఇరు దేశాల అధికార వర్గాలు ప్రకటించాయి. ఇదిలా ఉంటే అమెరికాలోకి దిగుమతయ్యే చైనా వస్తూత్పత్తులపై సుంకాలను 145 శాతం నుంచి 30 శాతానికి తగ్గించడానికి, అలాగే చైనాలోకి వచ్చే అమెరికా వస్తూత్పత్తులపై టారిఫ్‌లను 125 శాతం నుంచి 10 శాతానికి దించడానికి రెండు దేశాలూ అంగీకరించాయి.

### అమెరికాపై భారత్ ప్రతీకార సుంకాలు?

దేశంలోకి వచ్చే అమెరికా ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై ప్రతీకార సుంకాలు వేస్తామని భారత్ సోమవారం ప్రపంచ వాణిజ్య సంస్థలో ప్రతిపాదించింది.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.